# పేకాట భాగోతం

## దాట్ల దేవదానం రాజు

ఆరోజు ఆదివారం - స్కూలుకి సెలవు.

ఏమీ కాలక్షేపం గాక వీథిలో కొచ్చాను. కొంతదూరం నడిచానో లేదో సన్నగా తుంపర్లు పడటం మొదలెట్టింది. భారీగా వర్షం పడేటట్లుగా వుంది వాతావరణం.

మా కోలంక గ్రామానికి ఒకే వీథి. ఆ వీథి నెహ్రూ బొమ్మ దగ్గర నుంచి ఒక కిలోమీటరు పొడవుండి రోడ్డు కిరువైపులా కట్టిన ఇళ్ళతో వుంటుంది. కచేరి దాటానో లేదో ఓ యింటి అరుగుమీద నుంచి అరుపు వినిపించింది.

"ఏవోయ్ దేవా! ఈ వేళ చతుర్ముఖ పారాయణానికి కూచుందామా?" అని వెంకన్నబాబుగారు పిలిచారు.

ఒక్కసారిగా మహబూబ్ ఆలీ గుర్తు కొచ్చాడు. ఆయన వ్యాసాలు చాల శ్రద్ధగా గమనిస్తున్నాను. నామనః పరిస్థితిని బేరీజు వేసుకొన్నాను. ఓ.కె. ఫైన్ నా అంగీకారాన్ని తెలియజేసాను.

"ఎక్కడ వేద్దాం?" అడిగారు ఆయన.

మాకు ఓ చోటంటూ లేదు. అందుకే అడిగారు ఆయన. మాయింటి దగ్గర కూర్చుందామని చెప్పాను. ఆ తర్వాత ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. ఎవరో కుర్రాడ్ని పేకలకు పంపించి మిగిలిన ఆటగాళ్ళకు కూడా కబురు పెట్టారు. ఆయన గొడుగు తీసుకుని రాగానే మరల వెనుకకు మా యింటికి బయలుదేరాము.

ఈలోపులో రాజబాబుగారు, జింబు (అసలు పేరు సూరి అయినా మేం అలాగే పిలుస్తాం లెండి), రంగ, కృష్ణ వచ్చేసారు. నేను ఎపుడోగాని పేకాటలో కూర్చోను. స్కూలులో పాఠాలు చెప్పి యింటికి వచ్చి సాయంత్రం ఏవో పుస్తకాలు చదువుకోవడం నా అలవాటు. టేబులు, కుర్చీలు సర్ది డబ్బు తీసుకుని రావడానికి లోపలికి వెళ్ళాను. నేను తిరిగి బయటకు వచ్చేటప్పటికి పేకలు వచ్చేసాయి.

ఒక్కసారి వాళ్ళకేసి చూసాను.

జింబు, రంగ తప్ప అందరూ లుంగీలలో వున్నారు. మహబూబ్ ఆలీ 'పేకాట' గుర్తుకొచ్చింది. ఆటగాళ్ళ అయిదుగురి గురించి ఒక్కసారి ఆలోచించాను. అపుడు నేను రూఢీ పరచుకొన్న విషయాలు కొన్ని వున్నాయి.

ఇది కొత్తచోటు కాదు. ఆట కింతని వసూలు చేసే చోటు అసలు కాదు.

ఇక ఇందులో ఇంచుమించు అందరూ సమాన జోడీలే. అయితే మాలో వెంకన్న బాబుగారు, రాజ బాబుగారు వయస్సులో బాగా పెద్ద.

వెంకన్న బాబుగారు కుర్రాళ్ళలో కుర్రవాడిగా, పెద్ద వాళ్ళలో పెద్దవారుగా వుండటంవల్ల ఆయన దగ్గరకు మాకు సంపూర్ణమైన చనువుంది. పోతే రాజబాబుగారు- ఆయనా పర్వాలేదు. ఇందులో క్రొత్త వారుగాని, మా బాస్‌లు గాని లేరు. ఇక మోసపూరితమైన ఆటగాళ్ళ గురించి- ఒక్క జింబుమీదే అనుమానం. రెండు సంవత్సరాల క్రితమే వీరి కుటుంబం కోలంకలో భూములు కొనుక్కొని స్థిరపడిపోయారు.

వీడి గురించి బోలెడు కథలున్నాయి.

శ్రీకాకోలులో వున్నప్పుడు పెద్దాడ చౌదరీలతో పేకాట ఆడేవాడని, పేకాటలో చాల సంపాదించాడని, పెద్ద స్టేకులో ఎపుడూ 'విన్నింగ్ హేండ్' అని, తర్వాతర్వాత అక్కడి వారు యితనితో పేకాట ఆడటానికి భయపడేవారని యిలా...ఎన్నో...అయితే నాకు వ్యక్తిగతంగా జింబుతో స్నేహం ఎక్కువ. బొత్తిగా అంత మోసం అతనిలో లేదేమోనని నా నమ్మకం.

ఇక రంగ, కృష్ణల గురించి. వీళ్ళిద్దరూ యించు మించు నా స్థాయివారే. మహబూబ్ ఆలీ చెప్పినట్లు నేను వీళ్ళతో ఆడవచ్చును. ఆ వ్యాసాలు చదవడం మొదలు పెట్టింతర్వాత పేకాటలో కూర్చోవడం నాకు యిదే మొదటిసారి. అందుకే ఆయన సలహాలు పాటించి లాభం పొందగలమనే ఆశ నాకుంది. నాకింకొక ప్లస్ పాయింట్ ఏమిటంటే వారెవ్వరూ 'పేకాట' గురించి చదవలేదు.

సరే-అందరూ కట్ కోసుకుని సర్దుకుని కూర్చున్నాము.

పేక పంపకం పూర్తి అయింది.

నా పేకని పరిశీలించాను. ఒక సీక్వెన్సు-ఇస్పేటు ఆసు, రాజు, మదాము వున్నాయి. ఒక సెంటర్ కార్డ్ సీక్వెన్సు ఫైర్ వుంది. ఒక ధంకా వుంది. మిగిలిన ఐదు ముక్కల్లో రెండు తొమ్మిదులు మినహా విడి కార్డులే.

ఇది జాక్‌పాట్. ఆట గెలిచే కారణాంశాల స్థాయి ఎట్లా వుంది? ఆడదామా? డ్రాప్ చేద్దామా...? ఆలోచిస్తున్నాను. ఒక్కసారి నాకు వెనుకగా వెచ్చని ఊపిరిలా తగిలింది. ఆ ఊపిరి మహబూబ్ ఆలీదే. సందేహంలేదు.

ఏమంటాడు?

"చాన్సెస్ ఆర్ వెరీ ఫ్యూ. బెటర్ టు డ్రాప్" ఉస్సురని డ్రాప్ చేసేసాను.

వెంకన్న బాబుగారి ప్రక్కకు తిరిగి పొత్తునుండి



విజయవాడలో ఇటీవల ఒక సభలో 'మన గ్రంథాలయాలు' పుస్తకావిష్కరణ చేస్తున్న రాష్ట్ర విద్యామంత్రి శ్రీ పి. ఇంద్రారెడ్డి. గ్రంథ రచయిత డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, స్వీకర్త శ్రీ మండవ శ్రీరామమూర్తి వేదికపై వున్నారు

తీసుకుంటున్న కార్డు చూసాను.

డామ్...షిట్...అది...అది...నా సెంటర్ కార్డ్ బిట్‌కి కార్డు.

అబ్బా! ఆలీ చంపేసావయ్యా!

చాల సేపటికిగాని ఆ ఆట పూర్తి కాలేదు.

అనవసరంగా ఆలీలా ఆలోచించి పొడు చేసుకున్నాను. ఖచ్చితంగా ఆ కార్డుతో నా పేక గెలిచే అవకాశం పెరిగింది.

తర్వాత ఆట పంపకం పూర్తి అయింది. ఆట కలుపుతున్నపుడూ లేదా ఆడుతున్నపుడూ జింబు ఏదో వాగుతూనే వున్నాడు. అది అతని పాడు అలవాటు. వెంకన్న బాబుగారు అందుకే ఎపుడూ తిడుతూ వుంటారు కూడా.

ఈసారి ముక్కల్ని చూసాను. పదులు, జోకర్లు. నా పేకలో ఒక సీక్వెన్సు, ఒక పది, మిగిలినవి ఒకదానికొకటి సంబంధం లేవు.

'మీరు ఆడేదెప్పుడూ గెలవడం కోసమే. ఇంకొకరికి ఒకులు లెక్క పెట్టే డబ్బులు పంచడానికి కాదు' మీ పేకని ఎట్టి పరిస్థితులలోనైనా 'షో' చూపించగలరా? వో...రైటో-డ్రాప్...'

ఆ తర్వాత జరిగిన ఆరు ఆటలలో ఒక ఆట మాత్రమే 'షో' చెయ్యగలిగాను. గెలిచిన ఆ ఆటకు చాల తక్కువ డబ్బులు కలెక్టు అయ్యాయి.

వర్షం ఉధృతమైంది.

ఉరుములతోను, గాలితోను బయటి వాతావరణం తీవ్రంగా వుంది.

గది సిగరెట్ల పొగతో నిండిపోయింది.

నేను సిగరెట్లు విపరీతంగా కాల్చి వేస్తున్నాను. ఆటలు పడక పోవడంతో నాకు ఏమాత్రం ఉత్సాహం లేదు. అనవసరంగా వీళ్ళమధ్య కూరుకు పోయానని పిస్తుంది. ఆటలోని మిగిలిన ఆటగాళ్ళు రాక్షసుల్లా కనిపిస్తు న్నారు.

అసలు పై వాతావరణం ఇలా వుండటంలో బయటకు వెళ్ళకుండా వుంటే ఈ మానసిక వ్యధ తప్పేది. లేచి లోపలికి వెళ్ళి మా శ్రీమతితో 'టీ'లు పెట్టమని చెప్పి మళ్ళీ వచ్చి కూర్చున్నాను.

"ఈసారి ప్రభుత్వం కన్ను అధ్యాపకులపై పడిందేమిటి? వాళ్ళ ట్యూషన్లపై ఒక్కసారిగా దాడి చేసిందట" పేక కలుపుతూ కృష్ణ అంటున్నాడు.

"నిజానికి ఈ విషయంలో ప్రభుత్వానిది ఏమీ తప్పులేదు. క్లాసుల్లో పాఠాలు చెప్పకుండా ట్యూషన్ల పేరిట వేలు గడిస్తున్నవారికి చక్కని గుణపాఠం" జింబు సిగరెట్టు పొగ విదిలిస్తూ అన్నాడు.

"నా ముక్కలు తీసుకుంటూ" ఏమాత్రం శ్రమ పడకుండా బల్లకిందకు మాత్రమే చెయ్యిపెట్టి తమ చేసి తీరవలసిన పనికే లంచాలు గుంజుతున్న వాళ్ళ కంటే ఈ లెక్చరర్లు నయం కదూ! కాస్త శ్రమపడి, కష్టపడి సంపాదిస్తున్నారు" అన్నాను.

ఏమైనా ఆట దిశను మార్చాలి.

'సాఫీగా జరుగుతున్న ఆట దిశ మార్చడానికి తప్పుడు పంపకం అన్నా చెయ్యాలి లేదా ఒక చెత్త పేక ఆడి ఎం.డి. అన్నా చెయ్యాలి'

చేతిలోని పేక ముక్కలు పరిశీలించాను.

ఆట ఆడటానికి ఏమాత్రం పనికిరాదు.

అయినా ఎం.డి. చేసేందుకు పొత్తునుండి ముక్క లాగాను. డైమాను జాకీని డిస్కార్డ్ చేశాను. అంతే!

దానితో ఎ.పి.డి.పి. అని చెప్పి రంగ 'షో' చేసాడు. తలపట్టుకుని ఫుల్ కౌంట్ లెక్క పెట్టి యిచ్చాను.

అందుకే పేకాట ఆడేటపుడు మీరు ఏ నిర్ణయం తీసుకున్నా, ఏపని చేసినా దాని వెనుక సరైన హేతువాదం, కారణాలు వుండాలి' అన్నాడు. అదే లేకపోతే కంట్రోలు తప్పి ఎంత డబ్బు అయినా పోగొట్టుకోవలసి వస్తుంది."


ఆ రెండు పూర్తిఅయ్యాక 'టీ' తీసుకుని రావడానికి లోపలికి వెళ్ళాను.

శ్రీమతి కుడి చేతిని ఎడమ చేతితో పట్టుకుని పళ్ళ బిగువున బాధ అనుభవిస్తూ చతికిలపడి కూర్చుంది.

"ఏమిటి...ఏమిటి" అంటూ గాభరాగా దగ్గరకు వెళ్ళాను. కళ్ళంట నీళ్ళు కారుతున్నాయి. మరుగు తున్న టీని చేతిమీద పోసుకుందట. కాసేపు ఓదార్చి టీలను కప్పులలో సర్ది పట్టుకొస్తుంటే అప్పుడంది ఏడుస్తూ-

"నేను కాలిపోయినా పర్వాలేదు. మీకు మాత్రం పేకాట వుంటే చాలు"






మా శ్రీమతి మాట వినిపించినా వినిపించనట్లే నెమ్మదిగా వీధి గదిలోకి వచ్చేశాను.

"రా! రా!" అంటూ వెంకన్న బాబుగారు తొందర పెద్తున్నారు.

నా మనస్సు అంతా గజిబిజిగా వుంది.

డబ్బులు చాలా పోగొట్టుకున్న కారణంగా విసుగ్గాను, అసహ్యంగాను వుంది.

జేబు తరుగుతున్న కొద్దీ బుర్ర పనిచెయ్యడం మానివేసింది.

ఏమి ఆడుతున్నావో ఎలా ఆడుతూ డిస్కార్డ్ కొడుతున్నావో తెలియకుండా ఆడుతున్నాను. ఉద్రేకం పట్టలేక కంట్రోలు తప్పి చెమటలు పట్టి దిగాలుగా వున్న పరిస్థితుల్లో అపుడు అనిపించింది. పేకాటలో డబ్బులు పోయే రోజున సాధ్యమైనంత తక్కువ పోయేలా చూసుకో. లిమిట్ దాటావంటే నీ పని గుండు సున్నాయే!'

ఈవేళ సాయంత్రం వరకూ ఆడితే ఎంతైనా పోగొట్టుకోవలసి వచ్చును.

ప్రస్తుత పరిస్థితుల్లో ఇక తప్పుకోవడం మంచిదనిపించింది.

ఓ అరగంట గడిచాక " సారీ! తలనొప్పి భరించలేక పోతున్నాను. ఇక నేను ఆడలేను. మీరు కంటిన్యూ చెయ్యండి" అని చెప్పి లేచాను.

వాళ్ళు పరిహాసంగా నవ్వుతూ ఏదో అంటుంటే లోపలికి వచ్చేసాను.

మంచంమీద పడుకుని పైన తిరుగుతున్న ఫేన్‌ను చూస్తూ అనుకున్నాను—

'ఈవేళ పేకాటలో పోగొట్టుకున్న డబ్బు బ్యాంకులో డిపాజిట్టు చేసానని అనుకొంటున్నాను. రేపుకూడ సెలవే కదా? ఎలాగైనా సిటింగ్ ఏర్పాటు చేసి నా డబ్బులు వడ్డీతో సహా బ్యాంకు నుండి విత్ డ్రా చేసుకోవాలి."

